# కథానాయకుడు

"నిలబడ్డారేం? వెళ్ళి రండి. సంచీ తీసుకోలేదూ?" అన్నది సీత. దుర్గమ్మ వంక చూసి, ఆమె నేలను చూస్తూ నిలబడి వుంది గానీ కదలలేదు.

"వెళ్ళండి మరి... డబ్బిచ్చానుగా? ఆలస్యమౌతుంది" అన్నది మళ్ళీ సీత. అయిష్టంగా కదిలి బయటికి వెళ్ళింది దుర్గమ్మ. ఆమె వెడుతోంటే, "వచ్చేటప్పుడు అల్లం, నిమ్మకాయలు తేవడం మర్చిపోకండి" అని కేకవేసింది సీత.

ఒక్క నిముషానికి దుర్గమ్మ వంటింటి గుమ్మం దగ్గరకు వచ్చి "చీటీ యిచ్చేసి రమ్మంటారాండీ దుకాణంలో?" అన్నది. సీతకు చికాకు వచ్చింది. "చీటీ యిచ్చి రావడమేమిటి? ఈ పూటకి కావాలిగా ఆ సరుకులు? ఉప్పు, బొంబాయిరవ్వ అన్నీ అవసరమేగా?" అన్నది విసుగ్గా.

దుర్గమ్మ వెళ్లిపోయింది మారు మాట్లాడక. వంటకి యింట్లో కుదిరిన యిరవై ఏడేళ్ళ మనిషి దుర్గమ్మ. అవసరాన్నిబట్టి పై పనులు కూడా చేస్తుంటుంది.

రాత్రి భోజనాలైనాక ఆమె వంటిల్లు సర్దేసి యింటికి వెళ్ళిపోతుంటుంది. ఇల్లంటే తల్లిదండ్రులు అన్నదమ్ములది కాదు. దూరపు బంధువులది. ఆమెకి పెళ్ళిచేయక, చదువూ చెప్పించక వాళ్ళ వాళ్ళు వదిలేయడం వల్ల ఆమె తన బతుకు తను చూసుకోవడం ఆరంభించింది.

ఆవేళ పనులన్నీ పూర్తయినాక గది గుమ్మం దగ్గర నిలబడి, "ఒక విషయం చెబుతానుగానీ మీరేమీ అనుకోరు గదండీ" అన్నది.

"చెప్పండి ఏమిటో, అనుకునేందుకేముంది?" అన్నది సీత.

"నేను ఆ కస్తూరీ స్టోర్సుకి వెళ్ళనండి ఆ ఒక్క పని తప్పితే ఏదైనా సరే నాకు చెప్పండి" అన్నది.

ఆమెని కారణం ఏమిటి అని అడగకుండానే సీత ""సరే లెండి" అన్నది క్లుప్తంగా.

"ఏమీ లేదండి నేను నలుగురిలో తిరిగేదాన్ని. బజారుకి వెళ్ళడం కూడా ఏమీ నామోషీ కాదు. కానీ మనం గౌరవంగా వెళ్ళే చోట్లుంటాయి. వెళ్ళని చోట్లుంటాయి కాదండి అందుకని" అన్నది దుర్గమ్మ కొంచెం గట్టిగా.

సీత నిశితంగా చూస్తూ "కస్తూరీ స్టోర్సుకి నేనూ వెడుతుంటాగా? నాకు అంత అగౌరవం ఏమీ కనబడలేదే?" అన్నది.

దుర్గమ్మ ఇలాంటి సమాధానం వస్తుందని అనుకోలేదేమో ఒక్క పావునిముషం మౌనంగా వుండిపోయింది.

వెంటనే "మీ సంగతివేరండీ, నా సంగతి వేరండీ. ఆడమనిషి ఆధారం లేకుండా వుందంటే ప్రతి వాడికీ పెడబుద్ధులు పుడుతుంటాయండీ. ఆ స్టోర్సులో రంగనాయకులని ఒక చింతమొద్దు వున్నాడండీ... మీరు నా అప్పచెల్లెళ్ళ లాంటి వారు కాబట్టి చెబుతున్నాను. ఆ చింతమొద్దు వుత్త వెకిలి మనిషి. వెకిలిగా నవ్వుకోని, వాగుకోనీ, నాకేమిటి అని వూరుకుంటుండేదాన్ని.. కానీ యీవేళ వాడు మితిమీరిపోయి నాచేయి..." అని ఆవేశం అడ్డు వచ్చి, మాటరాక ఆగి పోయింది దుర్గమ్మ.

సీత చాలా ఆశ్చర్యపోయింది. రంగనాయకుల్ని ఏ విశేషణంతోనైతే వర్ణించిందో కొంచెం ఇంచుమించుగా దాన్ని దుర్గమ్మకు వర్తింపచేయవచ్చు. ఐతే రంగనాయకులు ముఖం కొంచెం కళగా వుంటుంది. ఏ ప్రమాణం ప్రకారం చూసినా ఆమెలో స్త్రీ సహజమైన కోమలత్వం కనబడదు. కొంతసేపు యిల్లా ఆలోచిస్తూ ఆమె వంక చూశాక గుర్తుకు వచ్చింది తనలా కళ్ళు వప్పగిస్తూ చూస్తున్నానని.

"ఆహా.. అలాగా!" అన్నది మెల్లిగా సీత.

"ఔనండీ. మీరు ఏమీ అనుకోకండి" అన్నది దుర్గమ్మ.

"నేను అనుకునేందుకు ఏముంది గానీండి.. పొద్దు పోతోంది వెళ్ళిరండి" అన్నది సీత.

ఈ సంఘటన జరిగాక రెండు మూడు రోజులకి సీత సాయంత్రం షాపింగుకి వెళ్లి వస్తూ హెయిరాయిల్ కోసం కస్తూరీ స్టోర్సులోకి వెళ్ళింది. అక్కడ కాటాలో కందిపప్పు తూస్తూ రంగనాయకులు కనబడ్డాడు. ఇల్లా సాధుత్వం ఉట్టిపడుతూ ఆవులా వున్నాడు. వీడికి అంత సాహసం ఎక్కడిదబ్బా అనిపించింది సీతకి. కానీ ఏమో ఏక్షణాన ఎవరికి ఏమి బుద్ధి పుడుతుందో మరి అనుకుంది.

రోజూ రాత్రి భోజనాలై పనులన్నీ పూర్తయ్యేసరికి తొమ్మిది గంటలయ్యేది. గడియారంలో ముల్లు ఎనిమిది చేరుకున్నప్పట్నించీ దుర్గమ్మ భోంచేసి బయటపడటానికి ఆరాటపడుతుండేది. సీత కూడా ఆమెను త్వరగా పంపించాలనే ఆలోచించేది. ఒకరోజు ఏడున్నరవుతుండగా గది తలుపు దగ్గరకు వచ్చి నిలబడింది దుర్గమ్మ. సీత రేడియో వింటూ ఎంబ్రాయిడరీ కుట్టుకుంటోంది.

""ఏమండీ మీరు ఏమీ అనుకోకపోతే ఒకమాటండీ" అన్నది దుర్గమ్మ. రేడియో తగ్గించి, సీత ఏమిటన్నట్లు చూసింది.

"నిన్న రాత్రి ఒక ఘోరం జరిగింది" అని దుర్గమ్మ అనగానే చేతిలోని పని ఆపి కళ్ళు పెద్దవి చేసి చూసింది సీత.

"నేను మామూలుగా తొమ్మిదింబావుకల్లా వెళ్ళి పోతున్నానండీ రోడ్డు మీద. అసలు నేను ఎటూ చూడను. తలవంచుకుని వారగా గబగబా నడిచిపోతాను. అక్కడ జనతా హోటలు మలుపు దగ్గర సోడా బండీ, పళ్ళ బండీ అవీ అడ్డుగా ఉన్నాయండీ. కొంచెం ప్రక్కకు తప్పుకుందామంటే ముగ్గురు మగవాళ్ళు అడ్డుగా నిలబడి వున్నారు. నేను ఆగిపోయి ఫుట్‌పాత్ దిగి రోడ్డు మీద నడిచానండీ. ఆ ముగ్గురు మగవాళ్ళు కూడబలుక్కున్నారో ఏమో నా వెంటే వస్తున్నారని ముందు అనుకోలేదండీ. మనకి అటువంటి తలపులు ఎట్లా వుంటాయండీ?" గుక్క తిప్పుకోవడానికని ఆగింది దుర్గమ్మ.

సీత రేడియో స్విచ్ ఆఫ్ చేసి "అయ్యో ఇల్లు క్షేమంగా చేరారా లేదా, ప్రొద్దున్న చెప్పలేదేం నాకు?"

దుర్గమ్మ బాధపడసాగింది. "ఏమో నండీ నా బాధలేవో నేను పడాలి గానీ మీకు కూడా ఎందుకని వూరుకున్నాను."

"సరే, ఏమైంది. వాళ్ళు ఎందాక వచ్చారు?"

"ఊరికే కూడా వచ్చినా ఫరవాలేదండీ. గబగబ వచ్చి నన్ను రాచుకుంటూ ఒకడు ముందుకు వెళ్ళి లైటు స్తంభం దగ్గర నిలబడ్డాడు. రెండో వాడు అసహ్యంగా మాట్లాడుతూ ఎంతంటే అంతిస్తాం రావా అని స్పష్టంగా అడిగాడండీ. నాకు వణుకు, దడ పుట్టుకొచ్చాయి. గట్టిగా అరుద్దామంటే నోట్లోంచి మాటరాదు. మూడోవాడు కూడా ఏంటమ్మాయి, వస్తావా రావా అని రెట్టించాడు. నేను అల్లాంటిదాన్ని కాదని ఓ కేక పెడదామని. కానీ ఏదీ మాటరాందే" దుర్గమ్మ కళ్ళు పెద్దవి చేసి,బాధపడుతూ చెబుతోంటే సీతకి చాలా జాలి వేసింది. పాపం ఒంటరి ఆడమనిషి. వెడుతోందంటే ఇంత చులకన కదా యీ వెధవ లోకానికి అనుకుంది. "ఆ లైటు స్తంభం వరకు స్పీడుగా నడిచాను. పరుగెత్తాననుకోండి ఇంతలో 'ఏయ్ ఎవరబ్బాయ్!' అంటూ ఓ కేక వినబడింది వెనకాల్నుంచి.ఆ కేకకు యీ ముగ్గురూ ప్రక్క సందులోకి జారుకున్నారు. పాపం ఎవరో పెద్దమనిషి నాదగ్గరకు వచ్చి, "ఏవమ్మా ఆ మలుపు నుంచీ చూస్తున్నాను. నిన్ను వీళ్ళు అల్లరి పెట్టడం. పద. మీ ఇల్లు ఎక్కడో దింపుతాను" అని కూడా వచ్చాడండీ. నేను మా వాళ్ళింట్లో కూడా ఎవరికీ ఏమీ చెప్పలేదు. నన్నే కూకలేస్తారు. అర్ధరాత్రి వరకూ రోడ్ల మీదుంటే ఏమౌతుందని, ఇల్లు అంత దూరం వుండగానే ఈ పెద్ద మనిషిని కూడా పంపేశాను దణ్ణాలెట్టి. ఈయనెవరో వెంటబెట్టుకొచ్చాననుకోరూ! మనం నిప్పులా వున్నా గానీ అందరి కళ్ళకీ అల్లా కనబడం కాదండీ?" అన్నది దుర్గమ్మ.

"నిజమే పోనీ.. మీకు కూర అదీ తీసి ఇస్తాను. ఏదో తినేసి వెళ్లండి. మా కోసం కూర్చుంటే అల్లాగే పొద్దు పోతుంటుంది" అన్నది సీత.

దుర్గమ్మ తన అడ్డంగా ఆడించింది. ముక్కున వేలు వేసుకుంది. "అబ్బెబ్బే మగవారు భోంచెయ్యకుండా నేను నోట్లో ముద్ద పెట్టుకుంటానాండీ, నా కంఠంలో ప్రాణం వుండగా అల్లా చెయ్యలేను. ఫర్వాలేదులెండి. కాస్సేపు కూర్చుంటాను. తెల్లారికి గోరు చిక్కుడు కాయలు తరిగి పెట్టుకుంటాను" అంటూ వెళ్ళిపోయింది.

నెల్లాళ్ళు గడిచాయి. దుర్గమ్మ ఇప్పుడింక సీత ఇంట్లో వుంటోంది. చీకటి పడ్డాక ఆడమనిషి ఒంటరిగా ఎక్కడికి పోతుందిలే అనుకుంది సీత. అంతే కాక ఇంట్లోనే వుంటే అన్ని పనులకు రోజంతా సాయం వుంటుందని కూడా ఆలోచించింది.

ఒకరోజు మధ్యాహ్నం ఆమె చిన్న విన్నపం చేసింది. తను సాయంత్రం చుట్టాలింటికి వెళ్ళి వస్తానని, రాత్రి వంటకి భోజనానికి వుండనని.

"అల్లాగే వెళ్ళిరండి" అన్నది సీత.

కొంతసేపు దుర్గమ్మ అల్లా నిలబడి, "ఇంట్లో వుంటానని ఒప్పుకుని ఇల్లా వెళ్ళిపోతుందేమిటి అనుకుంటున్నారా?" అన్నది.

"అబ్బే లేదు. ఏవో మీ పనులు మీకుంటాయి. వెళ్ళి రండి ఫరవాలేదు" అన్నది సీత.

"మీ దగ్గర నాకు దాపరికం దేనికి గానీండి. నేను ఒకరి సలహా మీద ఒక పని చేయదలిచాను"

"అహా అల్లాగా!" అన్నదే గాని సీత ఏమిటాపని సలహా ఇచ్చిన వారెవరు? అని అడగలేదు.

"నాకు స్వంతంగా పనులంటూ ఏమీ ఇంతవరకూ లేవు. ఇహ ముందు భగవంతుడు కనికరిస్తే నాకు తాపత్రయాలూ, పనులూ, బాధ్యతలూ రావాలి" ఇలా అంటుంటే ఆమె ముఖంలోకి చిన్న నవ్వు వచ్చి మెల్లిగా మాయమయింది.

అప్పటికీ సీత విశేషం ఏమిటని అడుగకపోయేసరికి "నాకు తోడు నీడగా వున్నారు మీకు చెప్పక పోవటం దేనికి గానిండి. నాకు సంబంధం చూశారు మా వాళ్ళు"

సీత అప్రయత్నంగా నోరు తెరచి "సంబంధమా?" అన్నది అనేసిన తర్వాత అట్లా అనడం పొరబాటేనని అనిపించింది. దుర్గమ్మ పాపం ఆడది. అవివాహిత. పెద్ద వయస్సూ మించి పోలేదు. ఆమె పెళ్ళి

సంబంధం మాట చెబితే తను అంతలా నోరుతెరచి ఆశ్చర్యపోనవసరం లేదు. ఐతే యీ దుర్గమ్మని చేసుకునేవారెవరా అనే ఆమె ఆశ్చర్యమంతా.

"ఔనండీ. ఆ సంబంధం అన్ని విధాల మంచిదేట. ఎటొచ్చీ అతను అంతగా బాగుండడుట" అని తల వంచుకుంది దుర్గమ్మ.

"అవన్నీ పట్టించుకో కూడదండి దుర్గమ్మగారూ. అంత మంచివాడైతే యీ సంబంధం కుదిరితే చాలా బాగుంటుంది. మీరు త్వరగా తెములుచుకుని వెళ్ళండి" అని చెప్పి సీత పనున్నట్లు అక్కడ్నించి లేచింది. సాయంత్రం ఔతుంటే ఆమె తీరువాలోంచి ఒక లేత గులాబి రంగు చీరె ఒక్క పిసరు వన్నె, మెరుపు తగ్గింది. ఉంటే తీసిచ్చింది. "ఇది కట్టుకోండి మీ కిద్దామని ఎన్నాళ్ళుగానో అనుకుంటూ మర్చిపోతున్నాను" అన్నది.

దుర్గమ్మ ముఖం విప్పారింది. ఆ చీరె కాగితంలో చుట్ట పెట్టుకుని ఆమె వెడుతుంటే సహృదయురాలైన సీత మనస్సులో ఆశీర్వచనాలు పలికింది.

❊

"ఔను సీతా, నా మాట విను" అన్నాడు రఘుపతి.

"ఊరుకోండి, మీరు మరీను" అన్నది సీత.

"అయ్యో, వెర్రి మొహమా, రేపు పెద్ద అల్లరై పోయి చుట్టుప్రక్కల వాళ్ళంతా చూడ్డానికి వస్తే బాగుంటుందా?" అన్నాడతను.

ఈ సంభాషణకి పూర్వం జరిగిందేమిటంటే ఆనాడు గులాబీ చీరె కట్టుకున్నా కూడా దుర్గమ్మకి ఆ సంబంధం కుదరలేదు. ఆ అబ్బాయి చాలాపోకిరీగా చూశాడనీ, ఏమీ పెద్దమనిషి వాలకం లేదని తను వద్దనేశాననీ చెప్పింది దుర్గమ్మ. అదీ మన మంచికే అయింది. ఆమె పెళ్ళి చేసుకుని పోతే మళ్ళీ వంటకి ఎవరు కుదిరేవారని అనుకుంది సీత. మళ్ళీ యధాప్రకారం దుర్గమ్మ సీత వాళ్ళింట్లోనే వుండసాగింది. సీత ఇచ్చిన గులాబీ జరీ చీరె మాత్రం ఉతికి ఆరేసి సంచీలో దాచుకుంది. మిగిలిన రెండు, మూడు చీరెలే అస్తమానం తడుపుతుండేది గాని, ఆ చీరె తీయడం లేదు.

ఒకవారం చూశాక సీత అడిగింది . "ఏమండీ నేనిచ్చిన చీరె మీకు బాగుండలేదా?" అని.

దుర్గమ్మ "బాగానే వుందండీ. బాగోకేం?" అన్నది.

"మరి కట్టుకోరేం? ఆ రెండే వుతికి కట్టుకుంటున్నారేం?"

దుర్గమ్మ తను వత్తుతున్న చపాతీ అలా వదిలేసి, పరధ్యానంగా తల వంచుకుని కూర్చున్నది. "నేను ఆ చీరె మీ ఇంట్లో కట్టుకోనండీ."

"ఏం?" అని, నిజంగా చాలా ఆశ్చర్యపోతూ అడిగింది సీత.

"అల్లా కట్టుకోవడం మంచిది. కాదండీ మరి నన్ను అడక్కండి" అన్నది.

సీతకి భలే కోపం వచ్చింది. "ఏమిటి విచిత్రంగా మాట్లాడుతారు. బట్టలకి యిబ్బంది పడుతున్నారు కదా కట్టుకుంటారని యిచ్చాను కానీ దాచుకోమని కాదుగా? అంత మంచిది కాకపోతే పనిమనిషికి పారేయండి. కళ్ళ కద్దుకుని కట్టుకుంటుంది" అన్నది.

దుర్గమ్మ తలెత్తింది. కన్నీళ్ళొకటే తరువాయి ఆమె ముఖంలో. అంత దీనంగా వుంది.

"మీరంత గట్టిగా అంటున్నారు కాబట్టి కారణం చెబుతానండీ. అది మీరు కట్టుకునే చీరె. మీరు ఇంట్లో వున్న టైముంటుంది, లేని టైముంటుంది. అల్లాంటప్పుడు నేను అది కట్టుకొని యింట్లో తిరుగుతోంటే మీరే అనుకుని పొరబాటున..." అని ఆగిపోయింది.

సీత కళ్ళు పెద్దవి చేసింది ఆశ్చర్యంతో. "ఐతే మిమ్మల్ని చూసి నేనని ఎవరనుకుంటారు" అన్నది.

"పొరపాటునేనండి చాలా ప్రమాదాలు వస్తాయండి. మొన్న మీరు సినిమాకి వెళ్ళినప్పుడు..." అని మళ్ళీ ఆగిపోయింది.

సీతగుండె ఝల్లుమంది. తను ఈవిణ్ణి ఇంట్లో వదిలి సినిమాకు వెళ్ళినప్పుడు ఏం జరిగిందబ్బా!

ఈ సంభాషణంతా రఘుపతికి చెప్పినప్పుడు అతను "ఆవిణ్ణి పంపించేయి సీతా" అన్నాడు.

"ఇంతకీ అంత అల్లరయ్యే పనులు మీరు ఏమి చేస్తారు?" అన్నదామె.

"అమ్మడూ సీతా–కస్తూరీ స్టోర్సు రంగనాయకులు, వీధిలోని ముగ్గురబ్బాయిలూ అల్లరి పనులు చేశారనే నీ వుద్దేశ్యమా?"

"ఊరికే కల్పించి చెప్పిందంటారా?" అందామె.

"పూర్తిగా అబద్ధమూ కాదు. నిజమూ కాదు. ఓ మాటు తనవంక ఎవరైనా పరధ్యానంగా చూసినా సరే ఆమెకి ఆ చూపుల్లో ఆ అర్థం కనబడుతుంటుంది. ఆమెది ఎంత కోతి మొహమైనా లోపల వున్నది స్త్రీ హృదయం. అది కోరే కోరికలు తీరడం లేదు. అందుకే ఆమె చిన్న చిన్న ఊహాలోకాలు కల్పించి వాటిలో బ్రతుకుతుంటుంది. ఔనే బాబూ, నీకు తెలియదు. ఆమె యింకా ఏమేమి అంటుందో మాన్పించేయి" అన్నాడు రఘుపతి.

సీత అనుమానంగా చూసింది. "ఆమె అల్లే కథలకి ప్రస్తుతం నాయకుడు ఎవరంటారు? పోనీ నేను సినిమాకి వెళ్ళిన రోజున.."

రఘుపతి గొంతు సవరించుకున్నాడు... "ఎవరైతేనేం? నీ మొగుడు కాకుండా వుండాలంటే ఆమెకు పది రూపాయలు బహుమానమిచ్చి పంపు" అన్నాడు.

సీత సరే అనలేదు.